ఎన్నికలకు సర్వం సిద్ధం

- మూగబోయిన మైకులు
- నేడు ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ

మణుగూరుటౌన్: అసెంబ్లీ ఎన్నికకు నియోజకవర్గాల్లో రిటర్నింగ్, ఎన్నికల అధికారులు సర్వం సిద్ధం చేశారు. హోరాహోరీగా జరిగిన పార్టీల ప్రచార ఘట్టం మంగళవారంతో ముగియడంతో ప్రచార రథాలు ఆగిపోయాయి. మైకులు మూగబోయాయి. ఎన్నికల నిర్వహణకు అధికారులు వేగం పెంచారు. ఈ నేపథ్యంలో పూర్తి ఏర్పాట్లు సిద్ధమవుతున్నాయి. 30వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం వరకు పోలింగ్ జరగనుండగా, ఇప్పటికే దాదాపు ఓటరు స్లిప్పులు పంపిణీ పూర్తి అయింది.

పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఎన్నికల సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాలకు ప్రత్యేక భద్రత ఏర్పాటు చేయడంతో పాటు, బుధవారం ఉదయం నుంచి ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలు, వీవీప్యాట్లతో పాటు ఎన్నికల సామగ్రిని అందించనున్నారు. ఇదే రోజు సాయంత్రం కేంద్రాలకు సామగ్రి, సిబ్బంది చేరే విధంగా ఏర్పాట్లు చేశారు.

244 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు..

పినపాక నియోజకవర్గంలోని ఏడు మండలాలైన ఆళ్లపల్లి, గుండాల, మణుగూరు, బూర్గంపహాడ్, పినపాక, అశ్వాపురం, కరకగూడెంలల్లోని 84 లోకేషన్లలో 244 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. రహదారి, సిగ్నలింగ్, విద్యుత్ తదితర సౌకర్యాలు సానుకూలంగా లేని బుగ్గ, దొంగతోగు, మోదుల గూడెం, సజ్జలబోడు వంటి మొత్తం 10 గ్రామాల నుంచి కేంద్రాల వరకు ఓటర్లకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు. కాగా 244 పోలింగ్ కేంద్రాల్లో 1200 మంది ఎన్నికల నిర్వహణ బాధ్యతలు నిర్వహించనున్నారు. వారికి బుధవారం ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల కల్లా కేంద్రాలకు చేరే విధంగా ఎన్నికల సామగ్రిని, రక్షణ సిబ్బందిని కేటాయించే విధంగా మణుగూరులోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సిబ్బందికి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు..

పినపాక నియోజకవర్గంలోని 7 మండలాల్లోని ఎన్నికలు సజావుగా నడిచేందుకు డీఎస్పీ రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో 09 కేంద్ర బలగాలు ఎన్నికలను పర్యవేక్షించనున్నాయి. పినపాక నియోజకవర్గం పూర్తి ఏజెన్సీ నియోజకవర్గం కావడంతో 57 లోకేషన్లను 120 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి, ఆ కేంద్రాల వద్ద భద్రతను అధికారులు పటిష్టంగా ఏర్పాటు చేశారు. ఈవీఎం, వీవీ ప్యాట్ల కమిషనింగ్ ప్రక్రియను పూర్తి చేసి సిబ్బందికి అధికారులు శిక్షణనిచ్చారు. ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లను ఎన్నికల పరిశీలకులు అజయ్‌లాల్ చంద్ సోనేజీ, ఐటీడీఏ పీఓ, రిటర్నింగ్ అధికారి ప్రతీక్‌జైన్‌లు పర్యవేక్షిస్తున్నారు. కాగా 18 మంది అభ్యర్థుల భవిష్యత్తును 1,98,402 మంది ఓటు ద్వారా నిర్ణయించనున్నారు.



మణుగూరులోని జెడ్పీ హెచ్ఎస్ పాఠశాల వద్ద ఎన్నికల సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు..

కాంగ్రెస్ ప్రచార హోరు



భద్రాచలంఅర్బన్: ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న పొదెం వీరయ్య



దుమ్ముగూడెం: మహిళలతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి పొదెం పద్మ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ, సీపీఐ, టీడీపీ పార్టీల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ తీశారు. పట్టణంలోని కొత్త మార్కెట్ నుంచి ప్రారంభం అయిన ర్యాలీ అంబేడ్కర్ సెంటర్, యూబి రోడ్డు, మసీద్ సెంటర్, సూపర్ బజార్ రోడ్డు, టెంపుల ఏరియా, అంబసత్రం రోడ్డు, ముదిరాజ్ బజార్, సాయిబాబా ఆలయం ఏరియా, పాత మార్కెట్, ఐటీడీఏ రోడ్డు వరకు సాగింది. ఈ సందర్భంగా భద్రాచలం కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య మాట్లాడుతూ.. 6 గ్యారంటీ కార్డులో చెప్పిన ప్రకారంగా హామీలు అన్ని అమలు చేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే భద్రాచలం ప్రాంత సమస్యలు తీరుతాయని, బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ పాలనలో భద్రాచలం నియోజకవర్గాన్ని పూర్తిగా విస్మరించిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర మంత్రి కవాసి లక్మా, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, తెలంగాణ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు బెల్లయ్య నాయక్, టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సరెళ్ళ నరేష్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతిరేల రవికుమార్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సతీమణి ప్రచారం..

దుమ్ముగూడెం: భద్రాచలం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొదెం వీరయ్య గెలుపును కాంక్షిస్తూ ఆయన సతీమణి పొదెం పద్మ మంగళవారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని లక్ష్మీనగరం, మూలకాపాడు, కన్నాపురం, బుర్రవేముల గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన ఆమె.. ప్రజలను పలకరిస్తూ ముందుకు సాగారు. మహిళా ఓటర్లలను విశేషంగా ఆకట్టుకున్నారు. ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గుర్తు హస్తంపై ఓటు వేసి గెలిపించాల్సిందిగా ఆమె ప్రజలను కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లంక అబ్బులు, మహిళలు కాంగ్రెస్ మద్ది కుమారి, సీతారామారావు, అప్పలరెడ్డి మద్ది రాము, శివ, సందీప్ రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

భద్రాచలంఅర్బన్: ఎన్నికల నియమావళిలో భాగంగా 48 గంటల ముందు అంటే.. మంగళవారం సాయంత్రం 4.00 గంటల నుంచి ప్రచారం నిలిపివేసినట్లు భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మైకులు, లౌడ్ స్పీకర్లు ఉపయోగించకూడదని సూచించారు. ర్యాలీలు, మీటింగ్‌లు నిర్వహించకూడదని, మద్యం షాపులు కూడా మూసి వేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దుమ్ముగూడెం: సార్వత్రిక ఎన్నికలలో ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సైలు కేశవరావు, పాటు గణేష్‌లు హెచ్చరించారు. మండలంలోని వివిధ పార్టీ నాయకులు, ప్రజలకు మంగళవారం పలు సూచనలు చేశారు. బైండోవర్ చేసిన వ్యక్తులు ఎటువంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినా.. వారికి పొందుపరిచిన షరతులు మీరినా.. వారికి లక్ష రూపాయల జరిమానా, 6 నెలల జైలు శిక్ష విధింపబడుతుందని హెచ్చరించారు.

అన్నపురెడ్డిపల్లి: ఎలక్షన్ కమిషన్ విధించిన నిబంధనలను ప్రజలు, పార్టీల నాయకులు తప్పకుండా పాటించాలని స్థానిక ఎస్సై షాహీన మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. మండలంలో మద్యం అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎలక్షన్ నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆమె కోరారు.

చండ్రుగొండ: ఎన్నికల ప్రచార గడువు ముగియడంతో ఇకపై పార్టీల శ్రేణులు ఎలాంటి ప్రచారం నిర్వహించిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై మాచినేని రవి హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 144 సెక్షన్ అమలు ఉందని, జనం గుమికూడి ఉండకూడదన్నారు. ఎన్నికల నియామవళి ప్రకారం నడుచుకోవాలని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేవిధంగా రాజకీయపర్టీలు, ప్రజలు పోలీస్‌శాఖకు సహకరించాల్సిందిగా కోరారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే..



అశ్వాపురం: ఎన్నికల ప్రచారంలో హామీపత్రం చూపుతున్న పినపాక కాంగ్రెస్ అభ్యర్థి వెంకటేశ్వర్లు

అశ్వాపురం: ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని పినపాక కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం భారజల కర్మాగారం ప్రధాన గేట్ వద్ద ఉద్యోగులను పాయం వెంకటేశ్వర్లు కలిసి హస్తం గుర్తుపై ఓట్లు వేసి ఆశీర్వదించాలని కోరారు. నెల్లిపాక బంజర గ్రామంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో పాయం ప్రత్యేక పూజలు చేశారు. మల్లెలమడుగు గ్రామంలో ఇంటింటి ప్రచార పాదయాత్రలో పాల్గొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పాటుపడతానని, హస్తం గుర్తుకు ఓటు వేయాలని పాయం ప్రజలను కోరారు. ఎన్నికల్లో గెలిచిన తరువాత ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని బాండ్ పేపర్‌తో హామీపత్రం చూపిస్తూ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, గాదె కేశవరెడ్డి, ముత్తినేని వాసు, వేములపల్లి రమేష్, ఓరుగంటి రమేష్, ఖదీర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

అన్ని నియోజకవర్గాల్లో మంగళవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రజలు నిర్భయంగా ఓటు వేసేలా.. వారిలో మనోధైర్యం నింపేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ర్యాలీగా బయలుదేరి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రలోభాలకు లోనవకుండా నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా పోలీస్ అధికారులు సూచించారు. – సాక్షి నెట్‌వర్క్



భద్రాచలంఅర్బన్: పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద సీఆర్పీఎఫ్ బలగాలతో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్..



మణుగూరురూరల్: మాట్లాడుతున్న ప్రతీక్ జైన్, పక్కన డీఎస్పీ రాఘవేంద్రరావు



అశ్వారావుపేటలో డీఎస్పీ వెంకటేష్ అధ్వర్యంలో..

అభివృద్ధి, సంక్షేమమే శ్రీరామరక్ష

బూర్గంపాడు: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే తమకు శ్రీరామరక్షగా నిలుస్తాయని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. సారపాకలో సోమవారం వివిధ పార్టీల నుంచి పలు కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరాయి. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికలలో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే మరిన్ని సంక్షేమ పథకాలను అమలుచేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, సానికొమ్ము శంకర్‌రెడ్డి, కొనకంచి శ్రీనివాస్, బాలి శ్రీహరి, కోమటిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, చుక్కపల్లి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి కృషి..

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్రంలో క్రైస్తవులు సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేసిందని పినపాక బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన పాస్టర్స్ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, బీఆర్ఎస్ నాయకులు, పాస్టర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, గుండాల మండలం కాంగ్రెస్‌పార్టీకి చెందిన సుమారు 25కుటుంబాల వారు రేగా సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు.



బూర్గంపాడు: సారపాకలో ప్రజలతో మాట్లాడుతున్న రేగా కాంతారావు

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, సర్పంచ్ కోడి కృష్ణవేణి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓట్లు వేసి రేగా కాంతారావును గెలిపించాలని ఓటర్లను కోరారు. అశ్వాపురంలో, భారజల కర్మాగారం ప్రధాన గేట్ వద్ద కందుల కృష్ణార్జున్‌రావు, వైస్ఎంపీపీ వీరభద్రం, బీఆర్ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ప్రచారం చేపట్టారు.

మణుగూరురూరల్: ఎన్నికల్లో పినపాక నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రేగా కాంతారావును గెలిపించాలని కోరుతూ.. మండలంలోని గ్రామాలు, మణుగూరు మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి రేగా కాంతారావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు ముత్యంబాబు, అడపా అప్పారావు, కుర్రి నాగేశ్వరరావు, నవీనబాబు, రామిరెడ్డి, నవీన్, వట్టం రాంబాబు, యాదగిరిగౌడ్, యూసఫ్ షరీఫ్, కృష్ణ, నర్సింహారావు, బూత్, యువజన, మహిళా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చివరి రోజు హోరాహోరీ ప్రచారం..

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రగొండలో బీఆర్ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రజలకు అభివాదం చేస్తు ముందుకు సాగారు. తనకు ఓట్లు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, దార వెంకటేశ్వరరావు, సంకా రామారావు, మేడా మోహన్‌రావు, సూరా వెంకటేశ్వర్లు, చీదళ్ల పవన్‌బాబు, ఎస్డీ రసూల్ పాల్గొన్నారు.

యాదవ, కురుమల మద్దతు..

అనేక సంక్షేమ పథకాలతో యాదవ, కురుమల బతుకుల్లో వెలుగులు తీసుకువచ్చిన బీఆర్ఎస్ పార్టీకే తమ మద్దతు ఉంటుందని కురమల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నం రామకృష్ణ ప్రకటించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాగా, కురుమల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దతు పలకడం తగదని యాదవసంఘం సీనియర్ నాయకుడు సారేపల్లి శేఖర్ మరో సమావేశంలో ఖండించారు.

ములకలపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను అశీర్వదించాలని పార్టీ అశ్వారావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు కోరారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, ఎంపీపీ మట్ల నాగమణి, జెడ్పీటీసీ సున్నం నాగమణి, నియోజకవర్గ నాయకురాలు ఒగ్గెల పూజతో కలసి ములకలపల్లిలోపాటు పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించి మాట్లాడారు.

సీపీఎం ర్యాలీ..

భద్రాచలంఅర్బన్: నియోజకవర్గ కేంద్రమైన భద్రాచలం పట్టణంలో ఎన్నికల ప్రచారానికి చివరి రోజైన మంగళవారం సీపీఎం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించింది. ర్యాలీని డాక్టర్ మిడియం బాబురావు జెండా ఊపి ప్రారంభించి ప్రసంగించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎంబి నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మర్లపాటి రేణుక, బి.రమేష్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు భీమవరపు వెంకటరెడ్డి, బండారు శరత్‌బాబు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధి కోసం ప్రజా పోరాటాలు నిర్వహించే సీపీఎం అభ్యర్థి కారం పుల్లయ్యను సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు మర్మం చంద్రయ్య కోరారు. మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో సాగిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. నాయకులు యలమంచి శీను బాబు, కంగాల రాంబాబు, సోయం జోగారావు తదితరులు పాల్గొన్నారు.

తెల్లం గెలుపు కోరుతూ..

చర్లరూరల్: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చర్ల పట్టణంలో సుమారు 500 మంది మహిళలతో ర్యాలీగా వెళ్తూ.. డాక్టర్ తెల్లం వెంకట్రావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బిఆర్‌యస్ పార్టీ మండల అధ్యక్షులు సోయం రాజారావు, కార్యదర్శి పోలిన లంకరాజు, ప్రచార కార్యదర్శి కొటేరు శ్రీనివాస రెడ్డి, ఎంపీపీ కోదండ రామయ్య, సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు పాల్గొన్నారు.

అర్జున్‌ను గెలిపించాలి..

ములకలపల్లి: సీపీఎం అశ్వారావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి పిట్టల అర్జున్‌ను గెలిపించాలని పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని గ్రామాల్లో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌సెంటర్ వద్ద వెంకట్ మాట్లాడారు. అన్నవరపు కనకయ్య, కొక్కెరపాటి పుల్లయ్య, ఎం.జ్యోతి పాల్గొన్నారు.

ఆశీర్వదిస్తే.. అండగా ఉంటా!



అశ్వారావుపేటరూరల్: ఎన్నికల ప్రచారంలో జారె ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి ఆశీర్వదిస్తే అన్ని వర్గాలకు తాను అండగా ఉంటానని అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జారె ఆదినారాయణ అన్నారు. మండలంలోని పేరాయిగూడెం, గుర్రాల చెరువు, మారుతీనగర్, అశ్వారావుపేటలో ఆయన మంగళవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా గ్రామస్తులు పలు సమస్యలను జారేకు వివరించగా.. సమస్యలను పరిష్కరించి అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జూపల్లి రమేష్, మొగళ్లపు చెన్నకేశవరావు, తుమ్మా రాంబాబు, జూపల్లి ప్రమోద్, కో ఆప్షన్ సభ్యులు ఎస్‌కే పాషా, మాజీ సర్పంచ్ నార్లపాటి సుమతి, రాములు, రామారావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల ర్యాలీ

దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జారే ఆదినారాయణకు మద్దతుగా కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు మంగళవారం మండలంలోని మందలపల్లి, దమ్మపేట, గోపాలపురం, జమేదారుబంజర, గండుగులపల్లి గ్రామాల్లో జారే ఆదినారాయణ ప్రచార రథంతో పాటుగా కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీలో అడుగడుగునా జారేకు ప్రజలు నీరాజనం పడుతూ, పూల మాలలతో పాటుగా పూల వర్షం కురిపించారు. ర్యాలీలో నాయకులు చిన్నశెట్టి యుగంధర్, కెవి.సత్యనారాయణ, యర్రగొర్ల రాధకృష్ణ, సాయిల నర్సీ, రావు రవిశంకర్, పగడాల రాంబాబు, చామర్తి గోపిశాస్త్రి, ఎర్రా వసంతం, రొయ్యల కుమార్, వెంకట్ పాల్గొన్నారు.

చేరికలు..

బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలు కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. మంగళవారం మండల కేంద్రం దమ్మపేట గ్రామంలోని మార్కెట్ యార్డు వీధిలో నివసించే జంగాల సామాజిక వర్గానికి చెందిన పలు కుటుంబాలకు చెందిన పురుషులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మండల కాంగ్రెస్ సీనియర్ నాయకలు, కండువాలు కప్పి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు పానుగంటి సత్యం, అత్తులూరి వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: బీఆర్ఎస్‌తోపాటు వివిధ పార్టీల నుంచి మంగళవారం కాంగ్రెస్ పార్టీలోకి భారీగా పలు కుటుంబాలు చేరాయి. మండలంలోని తిరుమలకుంట, కోయగూడెం, మామిళ్లవారిగూడెం గ్రామాలకు చెందిన సుమారు 120 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకులు జూపల్లి రమేష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ మెడియం నాగమణి, జూపల్లి ప్రమోద్, నండ్రు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యయ రిజిస్టర్లు పరిశీలన

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పినపాక నియోజకవర్గ బరిలో ఉన్న అభ్యర్థుల ప్రచారానికి సంబంధించిన ఖర్చుల వివరాలతో కూడిన రిజిస్టర్లను ఎక్స్‌పెండిచర్ పరిశీలన అధికారి అజయ్ లాల్‌చంద్ సోనేజీ మంగళవారం మణుగూరు రిటర్నింగ్ కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల బరిలో ఉన్న ఏజెంట్లతో సమావేశం నిర్వహించి ప్రచారాల ఖర్చులపై సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాఘవరెడ్డి, ఎక్స్‌పెండిచర్ సభ్యులు మహేష్ పాల్గొన్నారు.



రిజిస్టర్లను పరిశీలిస్తున్న అధికారి అబ్దుల్ లాల్‌చంద్ సోనేజీ

ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి

ములకలపల్లి: పాఠశాలల్లో తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజు శేఖర్ సూచించారు. మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల విద్యాప్రమాణాలు పరీక్షించారు. పాఠశాలలో నేటికీ 'ఉన్నతి' కార్యక్రమాలు ప్రారంభం కాలేదని గుర్తించి, టీచర్లకు పలుసూచనలు చేశారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు విధిగా ప్రారంభ పరీక్షలు నిర్వహించి, ఫలితాలను హెచ్ఎంలకు అందజేయాలని తెలిపారు. అనంతరం మాసపరీక్షలు నిర్వహించాలన్నారు. హైస్కూల్ హెచ్ఎం కె.లత, సీఆర్పీ రాజు ఉన్నారు.